క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

వీరపునాయునిపల్లి : మండలంలోని గంగిరెడ్డి పల్లె సచివాలయంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జరగనున్న ఆంధ్రకు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమానికి మ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నట్లు మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, మండస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులు ఆలయ ఆవరణలో విందు భోజనాలను చేశారు. ఆలయ సమీపంలోని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాక్యానుసారం ఎదగాలి

కమలాపురం : మీ ప్రేమ, ఆప్యాయత, అనురాగం మరువలేనిదని, ప్రతి ఒక్కరు వాక్యానుసారం ఎదగాలని ఎర్రగుంట్ల ఐసీఎస్ సీఎస్ఐ చర్చి ఫాస్టర్ జోసఫ్ తెలిపారు. ఆదివారం స్థానిక సీఎస్ఐ చర్చి ఫాస్టర్ భరత్ హెరాల్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ఆరాధన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వార్షికోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించడం హర్షణీయం అన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రేమ విందులో సంఘ సభ్యులు, పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సమైక్యత దినోత్సవం



మాట్లాడుతున్న జాతీయ సేవా సమితి కో ఆర్డినేటర్ మధుసుదన్

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిబుల్ఐటీలో జాతీయ సమైక్యత దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ సేవా సమితి కో ఆర్డినేటర్ మధుసుదన్ మాట్లాడుతూ ఈలాంటి అవగాహన సదస్సుల వల్ల విద్యార్థుల్లో జాతీయ సమైక్యత వాదం ఏర్పడుతుందన్నారు. అలాగే సమాజం పట్ల గౌరవం పెంపొందించుకోవాలన్నారు. అలాగే విద్యార్థులు సమాజంలో ఎలా మెలగాలి మెలకువలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ విశ్వనాథ్‌రెడ్డి, డాక్టర్ తిరుపతిరెడ్డిలు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి



ఎర్రగుంట్లలో ఇందిరాగాంధీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న చిన్నారులు

ఎర్రగుంట్ల : పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయంలో ఆదివారం 56వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మాజీ భారత ప్రధాని ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులకు ఆట పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రంథాలయ రికార్డు అధికారి ఉమాదేవి పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు.

వరల్డ్ కప్ స్క్రీనింగ్‌లకు భారీ స్పందన

రాయచోటి : ప్రపంచకప్ ఫైనల్ భారత్ – ఆస్ట్రేలియా మ్యాచ్ సందర్భంగా ఆదివారం ప్రత్యేక స్క్రీనింగ్ ఏర్పాటు చేశారు. మ్యాచ్‌ను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన లైవ్ స్ట్రీమింగ్‌కు క్రీడాభిమానుల నుంచి విశేష స్పందన లభించింది. వేలాది మంది వీక్షకులతో సందడిగా, కోలాహలంగా క్రీడా ప్రాంగణం మారింది. క్రీడాభిమానులు, ప్రజలు, మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషాతో కలిసి మ్యాచ్‌ను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కూడా ప్రజలతో కలిసి నేలపై కూర్చొని వీక్షించారు.

నందలూరులో..

నందలూరు (రాజంపేట) : భారత్ – ఆస్ట్రేలియా మధ్య ఆదివారం ప్రారంభమైన వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ వీక్షణ కోసం ఐకేపీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని అరవపల్లి ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ఆర్‌ఎస్ రోడ్డులో స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఈ మ్యాచ్ జరుగుతున్నంతసేపు యువకులు భారత జెండాలు పట్టుకొని ఉత్సాహంగా తిలకించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు వైఎస్సార్‌సీపీనాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉమామహేశ్వరుడి విగ్రహ ప్రతిష్ట




నూతన ఆలయంలో ప్రతిష్టించిన ఉమామహేశ్వరుడి విగ్రహం, పూజల్లో పాల్గొన్న భక్తులు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బయనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఆలయ కార్యనిర్వాహకులు తిరుమలశెట్టి మహేష్ ఆధ్వర్యంలో వైభవంగా విగ్రహప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగిన విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో కళ్యాణాన్ని వేద పండితులు వైభవంగా నిర్వహించారు. అనంతరం విగ్రహమూర్తులను గ్రామంలోని వీధుల్లో ఊరేగింపు చేశారు. స్వామి అమ్మవార్ల కళ్యాణాన్ని తిలకించేందుకు గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో చెక్కభజన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన దివిజ



ఎంపీడీఓ దివిజకు పుష్ప గుచ్ఛం అందిస్తున్న మండల అధ్యక్షురాలు

వేంపల్లె : మండల ఎంపీడీఓగా దివిజ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి తిరిగి పంచాయతీ విస్తరణ అధికారిగా భాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ దివిజ మాట్లాడుతూ మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రామారావు, ఎంపీటీసీలు బాబాషరీఫ్, భారతి, చంద్రశేఖర్, పద్మ, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ‘ఏపీకి జగనే ఎందుకు కావాలి’

కమలాపురం : కమలాపురం 3వ వార్డు సచివాలయంతో పాటు గంగవరం సచివాలయం వద్ద సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఏపీకి జగనే ఎందుకు కావాలి? కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొని కార్య క్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సీఎంగా మళ్లీ జగనన్నే రావాలి

పులివెందుల రూరల్ : రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి విశేష కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా మళ్లీ రావాలని జేసీఎస్ పట్టణ కన్వీనర్ పార్నపల్లె కిషోర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలుపొందడం తథ్యమన్నారు. కులమతాలకు తావు లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు చేస్తున్నారన్నారు.

జిల్లాస్థాయి స్కేటింగ్ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందులరూరల్ : క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహద పడతాయని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని క్రికెట్ స్టేడియం సమీపంలో జిల్లాస్థాయి స్కేటింగ్ సెలెక్షన్‌లు నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 50 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వారిలో 40 మంది క్రీడాకరులు ఎంపికైనట్లు నిర్వాహకులు, స్కేటింగ్ మాస్టర్ పవన్‌కళ్యాణ్, రాష్ట్ర స్కెటింగ్ అధ్యక్షుడు ప్రతాప్‌లు తెలిపారు. సివిల్ సప్‌లై డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, ఉపాధ్యాయుడు పెద్దిరాజు, కోచ్‌లు నాగేశ్వరరెడ్డి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

4వ తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక

ముద్దనూరు : 4వ తరగతి ఉద్యోగుల యూనియన్ ఎన్నికలు ఆదివారం ముద్దనూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ముద్దనూరు సమితి అధ్యక్షుడిగా అమీర్‌బాషా, కొండాపురం అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రతాప్, ఉపాధ్యక్షుడిగా కిషోర్‌కుమార్, కార్యదర్శిగా మహబూబ్‌బాషా, సంయుక్త కార్యదర్శిగా కుమారి, కోశాధికారిగా లక్ష్మిదేవి, కో ఆప్షన్ సభ్యుడిగా రంగనాయకమ్మ, ఈసీ మెంబరుగా వైష్ణవి ఎన్నికైనట్లు 4వ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్‌ప్రభుకుమార్ తెలిపారు.

సందడిగా అంతర్జాతీయ పురుషుల దినోత్సవం



స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సత్కరిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని ఆదివారం కడప నగరం పాత రిమ్స్‌లోని అల్‌షిఫా మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో సందడిగా నిర్వహించారు. సంస్థ నిర్వాహకులు రఫీ ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన వారందరికీ ఘనంగా స్వాగతం పలికారు. జిల్లాలోని పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కార్యక్రమానికి విచ్చేసి పురుషుల దినోత్సవ నిర్వహణ పట్ల తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. భవిష్యత్తులో ప్రభుత్వమే ఈ దినోత్సవాన్ని నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రఫీ, మిత్ర యోగా సెంటర్ నిర్వాహకులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, ఆకాశవాణి విశ్రాంతి ఉద్యోగి నరసింహాచారితో కలిసి వారందరినీ ఘనంగా సత్కరించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమానికి కొందరు మహిళా న్యాయవాదులు కూడా హాజరు కావడం విశేషం.

హిందీ ఉపాధ్యాయుడికి ప్రశంసలు

సిద్దవటం : 56వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సేవలు అందించినందుకు ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయుడు సమీర్‌బాషాను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ లింగాల ఉషారాణి ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో సమీర్‌బాషాకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్, డీఈఓ రాఘవరెడ్డి, సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ అంబవరపు ప్రభాకర్‌రెడ్డి ప్రశంసా పత్రాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు. గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేయాలని వారు కోరారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత

కడప స్పోర్ట్స్: విద్యార్థులు క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో జాతీయ స్థాయిలో రాణిస్తున్న వాలీబాల్ క్రీడాకారిణులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ క్రీడాపాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయమన్నారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి ఖాదర్‌వలి, కోశాధికారి సూర్యప్రకాష్‌లు మాట్లాడుతూ అక్టోబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్–17 వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో కడప క్రీడాకారిణులు కె.తులసి, టి.పావని, వి.కుసుమప్రియ, ఎస్.హేమశ్రీ, ఎన్.గాయత్రి, జి.శ్రీలక్ష్మిలు చక్కగా రాణించారన్నారు. దీంతోపాటు టి.పావని, కుసుమప్రియ, ఎన్.గాయత్రిలు అండర్–17 నేషనల్స్‌కు ఎంపికయ్యారని తెలిపారు. అనంతరం క్రీడాకారిణులకు మెమోంటోలు అందజేశారు. అదనపు సీనియర్ సివిల్‌జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్, వాలీబాల్ శిక్షకుడు గౌస్‌బాషా, శ్రీనివాసులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన అనంతపురం గంగమ్మకు భక్తులు బోనాలు సమర్పించి, తలనీలాలు అర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు ఆదిమూలం వంశీయులు రెడ్డిశేఖర్, చంద్రశేఖర్‌లు అమ్మవారికి అభిషేకం చేయడంతోపాటు కంకుమార్చనలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల వారే కాకుండా ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

తక్కువ వడ్డీకే బ్యాంకు రుణాలు

సిద్దవటం : డీసీసీ బ్యాంకు ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తామని డీసీసీ బ్యాంకు డీఆర్ ఓఎస్డీ గుర్రప్ప తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం నుంచి 70వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కడప డీసీసీ బ్యాంకు, సిద్దవటంలోని డీసీసీ బ్యాంకు బ్రాంచి, సిద్దవటం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, మండల పరస్పర సహకార పొదుపు సంఘాల సమాఖ్యలు కలిసి సిద్దవటంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గుర్రప్ప మాట్లాడుతూ ఎనిమిది లక్షల సహకార సంఘాల్లో 70వ అఖిల భారత సహకార వారోత్సవాలు జరుగుతున్నాయన్నారు.

‘సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే’



నూతనంగా ఎంపికైన బీటీఏ జిల్లా కమిటీ సభ్యులు

రాయచోటి అర్బన్ : సీపీఎస్‌ను రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పల్లం రామచంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని బీటీఏ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీపీఎస్‌ను రద్దుచేయాలని, జీపీఎస్‌లాంటి నూతన విధానాలను ఒప్పుకునే ప్రసక్తే లేదంటూ చెప్పారు. ఎన్నికల్లో ఎలాంటి హామీలు ఇవ్వని రాష్ట్రాలలో సైతం సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేస్తున్నాయంటూ చెప్పారు. బోధనకు ఆటంకంగా మారిన యాప్స్‌ను రద్దుచేయాలని, యాప్స్ నిర్వహణకు ఒక ప్రత్యేక కంప్యూటర్‌ను నియమించాలన్నారు.

బీటీఏ నూతన జిల్లా కార్యవర్గం ఎంపిక

అనంతరం బీటీఏ నూతన కార్యవర్గం ఎంపిక చేశారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా రాయచోటి రవిశంకర్, ప్రధాన కార్యదర్శిగా కల్లూరు శ్రీనివాసులు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా గణేష్ భూపతి, గౌరవాధ్యక్షుడిగా హబీబుల్లాఖాన్, జిల్లా ఉపాధ్యక్షులుగా ఏ.వి.రమణ, రాజారత్నం, ట్రెజరర్‌గా రాజశేఖర్, అదనపు ప్రధాన కార్యదర్శులుగా చిన్న చంద్రాయుడు, పల్లం జనార్దన్, సంయుక్త కార్యదర్శిగా పగడతోట రవిశంకర్, కార్యదర్శులుగా వెంకటసుబ్బయ్య, ప్రసాద్‌నాయక్, స్టేట్ కౌన్సిలర్లుగా అబ్దుల్ రజాక్, రాజయ్య, పల్లం రామచంద్ర లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామంటూ ప్రకటించారు. కార్యక్రమంలో బీటీఏ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

‘కార్తీక మాసం’కు ప్రత్యేక బస్సులు

జమ్మలమడుగు : కార్తీక మాసం పురస్కరించుకుని శైవ క్షేత్రాలకు వెళ్లే యాత్రికులకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ప్రవీన్ తెలిపారు. ఆదివారం స్థానిక డిపోలో విలేకరులతో ఆయన మాట్లాడారు.

నవంబర్ 20, 27, డిశంబర్ 4, 11వ తేదీల్లో కార్తీక సోమవారాలను పురస్కరించుకుని ఉదయం ఐదు గంటలనుంచి శైవక్షేత్రాలైన నయనాలప్ప, యాగంటి, మహానంది, ఓంకారం ఏర్పాటు చేసినట్లు వివరించారు. పెద్దలకు రూ.615, పిల్లలకు రూ.325 చార్జీలు ఉంటాయన్నారు. ప్రతి సోమవారం ఉదయం పొలతలకు కడప మీదుగా బస్సులను ఏర్పాటు చేశామని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పుస్తక పఠనం జ్ఞానాన్ని పెంపొందిస్తుంది



విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేస్తున్న కమిటీ సభ్యులు

జమ్మలమడుగు : పుస్తక పఠనం వల్ల జ్ఞానంతో పాటు సమాజంలో జరిగే పరిణామాలు, వివిధ కాలాల నాటి పరిస్థితులను తెలుసుకోవచ్చు అని రిటైర్డు ఎంఈఓ మస్తాన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా జరిగిన వివిధ రకాల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు గడియారం సాహితీపీఠం, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బండారు శ్రీనివాసులు అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదువడం వల్ల గొప్పవారి జీవిత చరిత్రలు తెలుసుకోవచ్చునన్నారు. చినిగిన చొక్కా తొడుక్కో ఒక మంచి పుస్తకం కొనుక్కో అని కందుకూరి విరేషలింగం చెప్పేవారన్నారు. విద్యార్థులు ఖాళీ సమయాల్లో సెల్‌ఫోన్‌లు దగ్గర పెట్టుకుని కాలాని వృథా చేయకుండా గ్రంథాలయానికి వచ్చి విలువైన సమయాన్ని ఇక్కడ గడుపుకుంటే జ్ఞానంతో పాటు మంచి విషయాలు తెలుసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రచయిత దర్పణ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తిలో విద్యార్థి దశ కీలకం అన్నారు. కార్యక్రమంలో మనోహర్‌రెడ్డి, డాక్టర్ నరసింహులు, రామయ్య, అమీర్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి భూమిపూజ



రామాలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న యువత

కమలాపురం : మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు సచివాలయం వెనుక వైపు రామాలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఆదివారం ఇందిరమ్మ కాలనీ రామాలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఆ కాలనీ యువత పర్యవేక్షణలో ఆలయ నిర్మాణానికి వేద పండితుల మంత్రోచ్చారణలతో భూమి పూజ నిర్వహించారు. దాతల సహకారంతో ఈ ఆలయ నిర్మాణం చేపడుతున్నామని, ఆసక్తి ఉన్న దాతలు ఆర్థిక సాయం చేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో కాలనీ యూత్ రాజశేఖర్, సోమశేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా

వైవీయూ : పాత పెన్షన్ విధానంపై రాజకీయ పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో యూటీఎఫ్ ద్వితీయ జిల్లా స్థాయి కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, ఎస్.ఎస్.నాయుడు యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వారికే రాబోయే ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ప్రస్తుత పాలకులు సీపీఎస్ రద్దు, ఓపీఎస్ అమలుపై కాలయాపన చేయడంతోపాటు కొత్తగా జీపీఎస్ పేరుతో సరికొత్త గందరగోళానికి తెరతీయడం సరికాదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీఏ, పీఆర్‌సీ, సరెండర్ లీవ్, పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు మాట్లాడుతూ యూటీఎఫ్ ఏర్పాటై 49 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలను ప్రారంభించామన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యులు దేవదత్తం మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగార్జునరెడ్డి, సహాధ్యక్షులు రవికుమార్, సుజాతరాణి, కార్యదర్శులు, కౌన్సిల్ సభ్యులు, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రమణేశ్వరస్వామి కల్యాణం



కళాశాలలో అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

కడప కల్చరల్ : కడవ నగరం దేవునికడప శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రమణేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ శ్రీధర్ పర్యవేక్షణలో అర్చకులు ఎం.సుబ్రమణ్యం కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. తొలుత మహాగణపతి పూజ, పుణ్యాహ వాచనం, ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, 108 శంఖాలలోని తీర్థంతో అభిషేకం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి పెళ్లి పీటలపై కొలువుదీర్చారు. కల్యాణం అనంతరం ముత్యాల తలంబ్రాల కార్యక్రమం సందడిగా సాగింది. రాత్రి కల్యాణ మూర్తులను మయూర వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.

అన్ని నియోజకవర్గాల్లోనూ నామినేషన్‌లు

రాజంపేట రూరల్ : గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం 175 నియోజకవర్గాలలో ఆర్‌ఎంపీలు, అనుబంధ సంఘాలు నామినేషన్‌లు వేయనున్నట్లు జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ డీవీఎస్ రాజు తెలియజేశారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2024 ఎన్నికలలో పోటీ చేసే ప్రతి పార్టీ గ్రామీణ వైద్యుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని మేనిఫెస్టోలో ప్రకటించాలని కోరారు. ఏ పార్టీ అయితే ఆ విధంగా ప్రకటిస్తుందో ఆ పార్టీకి తమ పూర్తి మద్దతు తెలుపుతామన్నారు.

కార్తీక పూజలకు ఆలయాలు సిద్ధం



కార్తీక మాస విశేష అలంకారంలో శ్రీ ప్రసన్న విశ్వేశ్వరుడు



మృత్యుంజయకుంట శివాలయంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు

కడప కల్చరల్ : కార్తీక మాసంలో అత్యంత పుణ్యప్రదంగా భావించే కార్తీక సోమవార పూజలకు జిల్లా అంతటా దేవాలయాలు సిద్ధమయ్యాయి. దీపావళి మరుసటిరోజు మధ్యాహ్నం కార్తీకమాసం ప్రారంభమైంది. కానీ కార్తీక మాసం తొలి సోమవారం ప్రభాత సమయంలో దీపాలు వెలిగించలేకపోయామన్న అసంతృప్తి భక్తుల్లో ఉంది. అలాంటి వారంతా ఈ సోమవారం తమ మొక్కులు తీర్చుకునేందుకు దీపాలు వెలిగించాలని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జిల్లాలోని ప్రముఖ శివాలయాలన్నీ భక్తులు దీపాలు వెలిగించుకునేందుకు తగిన స్థల వసతితోపాటు ఇతర సౌకర్యాలను కూడా కల్పించారు. దేవదాయశాఖ పరిధిలోని శివాలయాలలో ఆయా ఈఓలు, ఇన్‌స్పెక్టర్లు, కార్తీక దీపోత్సవాల నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాట్లు చేశారు. పలు ప్రైవేటు శైవ ఆలయాలలో కూడా స్థాయికి తగినట్లు భక్తులు దీపాలు వెలిగించేందుకు ఆలయ కమిటీ చైర్మన్లు, ధర్మకర్తలు తగిన ఏర్పాట్లు చేశారు. కడప నగరంలోని పది శివాలయాలలో కార్తీక దీపారాధనకు భక్తులు సిద్ధమయ్యారు.

మన గుడిలో భాగంగా..

తిరుమల–తిరుపతి దేవస్థానాలు మన గుడి కార్యక్రమంలో భాగంగా కార్తీక మాసోత్సవాన్ని నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఎంపిక చేసుకున్న శివాలయాలలో దీపాలకు అవసరమైన సామగ్రిని నిర్వాహకులే అందజేస్తూ భక్తులు దీపాలు వెలిగించేందుకు సహకరిస్తున్నారు. ప్రమిదలు, నూనె, వత్తులను భక్తులకు అందుబాటులో ఉంచనున్నారు. ఆలయాల వద్ద భక్తుల రద్దీని నిరోధించేందుకు ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయాల వెలుపల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసుల సహకారం తీసుకోనున్నారు. దేవాలయాలలో ఈ మాసమంతా తెల్లవారుజామునే శివయ్యకు విశేష అభిషేకాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు నగరంలో పలు చోట్ల భారీ హోర్డింగులు ఏర్పాటు చేశారు. సాయంత్రాలు భజనలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.